విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మండల
రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాష పై అవగాహన, వార్తలు రాయగల సత్తా
ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
JBN NEWS 24/7
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక



అనంతపురం
శ్రీ సత్యసాయి
5
శనివారం 7 మార్చి 2026

# అనంతపురంలో పోలీస్ ఓపెన్ హౌస్ కార్యక్రమం

- జిల్లా ఎస్పీ శ్రీ పి. జగదీష్ ఆదేశాల మేరకు ఓపెన్ హౌస్ నిర్వహించి పోలీసులు వినియోగించే ఆయుధాలు, సాధనాలపై విద్యార్థులకు అవగాహన
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాలలో భాగంగా చేపట్టిన ఈకార్యక్రమానికి విద్యార్థుల నుండి మంచి స్పందన





అనంతపురం, మార్చి 6 (అనంత ప్రభ)

అనంతపురం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని షాదీఖానాలో శుక్రవారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ శ్రీ పి. జగదీష్ ఆదేశాల మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమానికి నగరంలోని పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పోలీస్ శాఖ తమ దైనందిన విధుల్లో ఉపయోగించే వివిధ రకాల ఆయుధాలు, రక్షణ పరికరాలు, సాంకేతిక సాధనాలు ప్రదర్శనలో ఉంచారు. ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా ఆధ్వర్యంలో శిక్షణ పొందిన పోలీస్ సిబ్బంది ప్రతి ఆయుధం యొక్క వినియోగం, పని విధానం, భద్రతా నియమాలు గురించి విద్యార్థులకు మరియు సందర్శకులకు వివరంగా తెలియజేశారు. పోలీసులు తమ విధుల్లో వినియోగించే ఆయుధాలు, సాధనాలు మరియు సాంకేతిక పరికరాల గురించి విద్యార్థి దశ నుండే అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ సందర్భంలో ఏ ఆయుధాన్ని వినియోగిస్తారు, వాటి ప్రత్యేకతలు ఏమిటి అనే విషయాలను కూడా వివరించారు.

ప్రదర్శనలో .22 రైఫిల్, .410 మస్కెట్, .303 రైఫిల్, 7.62 ఎం.ఎం ఎస్ఎల్ఆర్, ఏకే-47, 5.56 ఎం.ఎం ఇన్సాస్ రైఫిల్, 9 ఎం.ఎం కార్బైన్, .38 రివాల్వర్, 9 ఎం.ఎం పిస్టల్, 9 ఎం.ఎం గ్లాక్, వి.ఎల్ పిస్టల్, 12 బోర్ పంప్ యాక్షన్ గన్, ఎల్.ఎం.జి, 51 ఎం.ఎం మోర్టార్, హెచ్.ఇ 36 గ్రనేడ్, యాంటీ రయట్ గన్స్, గ్యాస్ గన్ వంటి ఆయుధాలతో పాటు బాడీ ప్రొటెక్టర్లు, ఫైబర్ లాఠీలు, హెల్మెట్లు, స్టోన్ గార్డులు, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు (హెవీ, మీడియం, లైట్) వంటి రక్షణ పరికరాలు కూడా ప్రదర్శించారు.

అదేవిధంగా డే మరియు నైట్ విజన్ బైనాక్యులర్లు, జి.పి.ఎస్ పరికరాలు, మెగాఫోన్లు, లెటర్ బాంబ్ డిటెక్టర్లు, డీఎస్ఎమ్‌డీ, హెచ్‌హెచ్ఎమ్‌డీ, ఎన్ఎల్‌జెడీ, నార్కో డిటెక్షన్ కిట్లు, బాంబ్ బ్లాంకెట్లు, బాంబ్ షీల్డ్‌లు, ఎక్స్‌ప్లోసివ్ డిటెక్టర్లు, యూవీ లైట్లు, క్లూస్ టీం ఉపయోగించే ఫుట్ ప్రింట్ లిఫ్టర్లు వంటి ఫోరెన్సిక్ పరికరాలను కూడా ప్రదర్శించారు. ఆధునిక సాంకేతిక పరికరాలుగా టెథర్డ్ డ్రోన్‌లు, డ్రోన్ కెమెరాలు, బాడీ వోర్న్ కెమెరాలు, నెట్‌వర్క్ కెమెరాలు, సిమ్ బేస్డ్ కెమెరాలు, ఫిన్స్ (ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ నెట్‌వర్క్ సిస్టమ్), డీఎఫ్ఐడీ వంటి డిజిటల్ పరికరాలు కూడా విద్యార్థులకు చూపించారు. పోలీస్ డాగ్ స్క్వాడ్‌ను కూడా ప్రదర్శనలో ఉంచి వాటి పనితీరును వివరించారు. అంతేకాకుండా...

సైబర్ సురక్ష వాహనంపై వివిధ రకాల సైబర్ నేరాలు, వాటి దుష్ప్రభావాలు మరియు సైబర్ నేరాల అడ్డుకట్ట కోసం ఎలాంటి జాగ్రత్తలు చేపట్టాలో వీడియోలు చూపించారు. మహిళల భద్రత కోసం రూపొందించిన శక్తి యాప్ వినియోగం, శక్తి బృందాల సేవలు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర రెడ్డి, ఆర్.ఐ పవన్ కుమార్, మహిళా విభాగం సి.ఐ వెంకటేశ్వర్లు మరియు నగరంలోని పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సమన్వయంతో ఘనంగా నిర్వహించాలి



అనంతపురం, మార్చి 6 (అనంత ప్రభ)

ఈనెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం – 2026ను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఐసిడిఎస్, డిఆర్డీఏ, మెప్మా శాఖల అధికారులకు పలు సూచనలను జిల్లా కలెక్టర్ జారీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డిఆర్డిఎ, మెప్మా సంబంధిత శాఖల సమన్వయంతో ప్రతి సంవత్సరం మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటామని తెలిపారు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నగరంలోని జేఎన్టీయూలోని ఎన్టీఆర్ స్టేడియంలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, డి ఆర్ డి ఎ, మెప్మా తదితర అన్ని ఇతర శాఖల విభాగాలతో కలిసి జిల్లా స్థాయిలో మహిళా దినోత్సవాన్ని ఆదివారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తోందని, ఇందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు మహిళలకు మహిళా సాధికారత, లింగ వివక్ష నిర్మూలన, బాల్య వివాహాల నిర్మూలన తదితర రంగాలలో ప్రతిభ సాధించిన వారికి గౌరవ అతిథులు మరియు ముఖ్య అతిథుల ద్వారా సత్కరించడం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు మరియు ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో కూడా అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమాలను ఫలవంతంగా నిర్వహించాలని, ఆయా కార్యక్రమాల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో భాగంగా డిఆర్డీఏ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు మెగా చెక్కు పంపిణీ చేయడం జరుగుతుందని డిఆర్డీఏ పిడి శైలజ తెలిపారు. బ్యాంకు లింకేజీ కింద 1301 కోట్ల రూపాయలను, స్త్రీనిధి రుణాలు కింద 240 కోట్ల రూపాయలు, ఉన్నతి పథకం కింద సుమారు 13 కోట్లు, పి.ఎం అజయ్ కింద 2.50 కోట్ల రూపాయల చెక్కులను, మహిళా రైతు సంఘాలకు ట్రాక్టర్ల పంపిణీ జిల్లా కలెక్టర్, ముఖ్య అతిథుల చేత పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.

# టీడీపీకి కార్యకర్తలే నిజమైన హీరోలు
## స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపు బాధ్యత మీదే

- ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత టిడిపి కార్యకర్తలే బ్రాండ్ అంబాసిడర్లుగా నిలవాలి.
- పార్టీ అభ్యున్నతికి మీరే స్ఫూర్తిగా నిలవాలి.
- రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యాలయంలో టీడీపీ కమిటీ సభ్యులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి




పుట్టపర్తి, మార్చి 6 (అనంత ప్రభ)

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే నిజమైన హీరోలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కార్యకర్తల కృషియే ప్రధాన కారణం అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టిన టీడీపీ కార్యకర్తల సేవలను మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రత్యేకంగా అభినందిస్తూ వారిని ప్రశంసించారు.

విజయవాడ లోని మంగళగిరి టీడీపీ కార్యాలయంలో రాష్ట్రంలోని నియోజవర్గాల వారిగా ఎంపిక చేసిన టీడీపీ మండల కమిటీ సభ్యులతో శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో భాగంగా పుట్టపర్తి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ,

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థుల గెలుపుకు కీలక పాత్ర పోషించాలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి టీడీపీ కమిటీ సభ్యులకు సూచించారు. పార్టీ అభ్యున్నతికి కార్యకర్తలే నిజమైన హీరోలని ఆయన అన్నారు. ప్రస్తుతం రాబోయే కార్పొరేషన్ మున్సిపల్ జిల్లా పరిషత్ మండల పరిషత్ పంచాయతీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులే గెలుపొందేలా క్షేత్రస్థాయిలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ హయాంలో చేసిన ఆర్థిక విధ్వంసం తో పాటు రాష్ట్ర వెనుకబాటుకు కారణమైన విధానాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కూటమి ప్రభుత్వ అభివృద్ధికి టిడిపి కార్యకర్తలే గ్రామాల్లో బ్రాండ్ అంబాసిడర్లుగా పని చేయాలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పిలుపునిచ్చారు

# గత నెల 26న క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన ఎమ్మెల్యే దగ్గుపాటి టీం



అనంతపురం, మార్చి 6 (అనంత ప్రభ)

శాసనసభ్యుల క్రికెట్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో శాసనసభ్యుల క్రీడా పోటీల్లో నాదెండ్ల మనోహర్ గారి టీంలో ఎమ్మెల్యే దగ్గుపాటి బౌలింగ్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. గత నెల 26న జరిగిన కీలకమైన పోటీలో చివరి ఓవర్ అద్భుతంగా బౌలింగ్ చేసి జట్టుకు విజయాన్ని అందించారు. ఎమ్మెల్యేల, ఎమ్మెల్సీల క్రీడా సాంస్కృతిక ఉత్సవాల సందర్భంగా బహుమతుల ప్రదానం జరిగింది. పోటీల్లో విజేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబు గారి చేతుల మీదుగా బహుమతుల ప్రదానం జరిగింది. ఇందులో భాగంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారికి కూడా సీఎం చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. జట్టు సభ్యులందరూ మరోసారి దగ్గుపాటి బౌలింగ్ ప్రతిభను ప్రశంసించారు. శాసనసభ్యులకు నిర్వహించిన క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక అనుభూతినిచ్చాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గారి చేతుల మీదుగా బహుమతి అందుకోవడం ఎప్పటికీ గుర్తుంటుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు తెలిపారు.

# ప్రశాంతంగా నేడు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు



పుట్టపర్తి, మార్చి 6 (అనంత ప్రభ)

జిల్లా కలెక్టర్ శ్రీ శ్యామ్ ప్రసాద్ గారు కొత్త చెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి సంతృప్తి ని వ్యక్తం చేశారు. డిఐఇఓ ఆఫీస్ నుండి వివిధ కళాశాలల లో జరుగుతున్న పరీక్షలను సిసి కెమెరాల లైవ్ స్ట్రీమింగ్ ద్వారా పరిశీలించారు. ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ శ్రీ సురేష్ బాబు గారు కూడా జిల్లా కలెక్టర్ గారితో కలిసి పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా 42 పరీక్ష కేంద్రాల యందు పరీక్షలు జరిగాయి. నేడు ద్వితీయ సంవత్సర జనరల్ విద్యార్థులకు జువాలజీ పేపర్ 2, ఎకనామిక్స్ పేపర్ 2 మరియు ఒకేషనల్ విద్యార్థులకు వొకేషనల్ పేపర్ 3 పరీక్ష జరిగింది. జనరల్ విద్యార్థులలో 5972మందికి గాను 5727 మంది విద్యార్థులు హాజరు అయ్యారు. 245 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరు అయ్యారు. ఒకేషనల్ విద్యార్థులలో 1293 మందికి గాను 1233 మంది విద్యార్థులు హాజరు అయ్యారు. 60 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. జిల్లా మొత్తం మీద 7265 మంది విద్యార్థులకు గాను 6960 మంది విద్యార్థులు హాజరు అయ్యారు. 305 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, జిల్లా పరీక్ష నిర్వహణ కమిటీ సభ్యులు, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు మరియు కస్టోడియన్ లు జిల్లాలోని వివిధ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు

# యాడికిలో పప్పు సెనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం





యాడికి, మార్చి 6 (అనంత ప్రభ )

యాడికి మండలంలో రైతులకు మేలు కలిగించే విధంగా పప్పు సెనగ కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. యాడికి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో మార్క్ ఫెడ్ ద్వారా ఈ కొనుగోలు కేంద్రం ప్రారంభమైంది. ఈ కేంద్రంలో క్వింటాల్ పప్పు సెనగలను రూ.5875 మద్దతు ధరకు కొనుగోలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ఎటువంటి తూకపు తేడాలు లేకుండా పారదర్శకంగా సెనగలను కొనుగోలు చేస్తామని తెలిపారు. రైతులు విక్రయించిన సెనగలకు సంబంధించిన నగదును వారి బ్యాంకు ఖాతాలకు వారం నుండి పది రోజులలోపు జమ చేస్తామని వెల్లడించారు. రైతులు ముందుగా రైతు సేవ కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ అనంతరం రైతుల మొబైల్‌కు ఎన్ని క్వింటాళ్లు కొనుగోలు చేస్తారో సందేశం వస్తుందని, అందుకు అనుగుణంగా సొసైటీ ద్వారా ఎప్పుడు సెనగలను తీసుకురావాలో సమాచారం అందిస్తామని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, పరిమి చరణ్, సొసైటీ అధ్యక్షులు చలమారెడ్డి, ఉపాధ్యక్షులు హరి, మండల కన్వీనర్ దడియాల ఆది, వేములపాడు సొసైటీ అధ్యక్షులు నాగముణిరెడ్డి, సొసైటీ సీఈఓ కులశేఖర్ రెడ్డి, కోఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రమణ దేవి, మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా, గ్రామ వ్యవసాయ అధికారి రాంబాబు, కోడూరు నీలకంఠ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రైతులు కూడా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు

## పోలీస్ స్టేషన్‌లో పదోతరగతి ప్రశ్నాపత్రాలు




యాడికి, మార్చి 6 (అనంత ప్రభ )
యాడికిలో ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షల కోసం రాష్ట్ర ప్రభుత్వం పంపించిన ప్రశ్నాపత్రాలను విద్యాశాఖ అధికారులు యాడికి పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. యాడికి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏ, బి అనే రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏ సెంటర్‌లో 260 మంది విద్యార్థులు, బి సెంటర్‌లో 263 మంది విద్యార్థులు, అదేవిధంగా మండల కేంద్రంలోని స్టార్ ప్యారడైజ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 227 మంది విద్యార్థులు పరీక్షలను రాయనున్నారని, పరీక్షా ప్రశ్నాపత్రాలను పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచినట్లు యాడికి మండల విద్యాధికారి కాశప్ప తెలిపారు

## టీ కేఫ్‌లలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు



యాడికి, మార్చి 6 (అనంత ప్రభ)
యాడికి మండల కేంద్రంలోని పలు టీ కేఫ్‌లలో శుక్రవారం యాడికి సీఐ శ్రీనివాసులు తన సిబ్బందితో కలసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేఫ్ నిర్వాహకులతో మాట్లాడిన సీఐ శ్రీనివాసులు కేఫ్‌లలో ఎలాంటి అక్రమ కార్యకలాపాలకు అవకాశం ఇవ్వకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా గంజాయి వంటి మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం కల్పించరాదని హెచ్చరించారు. అనుమానాస్పదంగా కనిపించే వారిపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. నిబంధనలు పాటించని కేఫ్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

## బ్రహ్మోత్సవాలకు శయనోత్సవ సేవతో ముగింపు



యాడికి, మార్చి 6 (అనంత ప్రభ)
యాడికి మండల కేంద్రంలోని శ్రీ శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఆఖరి రోజు నిర్వహించిన శయనోత్సవ (ఏకాంత సేవ) పూజ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా యాడికి మండల వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వెన్నపూస వెంకటరామిరెడ్డి, నగరూరు బ్రహ్మానంద రెడ్డి, బాలా చైతన్య, వేళ్ళబోయిన వెంకటేష్, శంకర్, తదితర నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, గ్రామ ప్రజలు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు

## జూటూరు సచివాలయములో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం



యాడికి, మార్చి 6 (అనంత ప్రభ )
మలేరియా, డెంగ్యూ వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు శుక్రవారం పెద్దపప్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జూటూరు సచివాలయములో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు. గ్రామంలోని నీటి తొట్టెలలో లార్వాలను పరిశీలించి శుభ్రపరిచారు. అలాగే మురికికాలువల్లో పూడికను తొలగించి పరిశుభ్రత చర్యలు చేపట్టారు. ఏఎన్ఎం నగీన నిర్వహిస్తున్న ఎంఎఫ్ 2, డైరీలను పరిశీలించారు. గ్రామంలో జ్వరంతో బాధపడుతున్న వారి నుంచి రక్తపూతలు తీసి పరీక్షలకు పంపించాలని సూచించారు. అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్‌ను తనిఖీ చేసి మైక్రోస్కోప్ పనితీరును పరిశీలించారు. జ్వరంతో వచ్చే ప్రతి రోగికి మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులపై రక్తపరీక్షలు చేయాలని ల్యాబ్ టెక్నీషియన్ శివరాజన్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో మేల్ సూపర్వైజర్ ఎండీఎస్ వల్లి, ఏఎన్ఎం నగీన, ల్యాబ్ టెక్నీషియన్ శివరాజన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

## పంప్డ్ స్టోరేజ్ భూములను పరిశీలించిన జాయింట్ కలెక్టర్





యాడికి, మార్చి 6 (అనంత ప్రభ)
యాడికి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముటేషన్, ఎఫ్ లైన్ దరఖాస్తులు, పీజీఆర్ఎస్ అర్జీలపై తీసుకున్న చర్యల నివేదికలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మండలంలోని కమలపాడు, కుందనకోట గ్రామాల్లో ప్రతిపాదిత పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు సంబంధించిన భూములను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, జెన్‌కో సిబ్బంది ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆదినారాయణ, డిప్యూటీ ఇంజనీర్లు ఆంజనేయులు, రవి, మండల సర్వేయర్ శేషసాయి, వీఆర్వోలు భీమేశ్వర్ రెడ్డి, గంగన్న, సచివాలయ సర్వేయర్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు

## మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన






యాడికి, మార్చి 6 (అనంత ప్రభ )
యాడికి మండలం రాయలచెరువు సమీపంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యాడికి సీఐ శ్రీనివాసులు హాజరై విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాల గురించి వివరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందని తెలిపారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్యాభ్యాసంపై దృష్టి పెట్టాలని సూచించారు. కష్టపడి చదువుకుంటే ఉన్నత స్థాయికి చేరుకుని తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చడమే కాకుండా సమాజంలో మంచి పేరు తెచ్చుకోవచ్చని చెప్పారు. అలాగే మత్తు పదార్థాలు, సైబర్ మోసాల వంటి చెడు ప్రభావాలకు లోనై తమ భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు

## శ్రీశ్రీ ఎర్రితాత రథోత్సవ ఆహ్వానం



ఉరవకొండ, మార్చి 6 (అనంత ప్రభ)
ఉరవకొండ మండలం వై. రాంపురం గ్రామంలో భక్తుల కోరికలు తీర్చే కొంగ బంగారం వెలిసిన ప్రసిద్ధి చెందిన శ్రీశ్రీ ఎర్రితాత స్వామివారికి పూర్వకాలం నుండి ఆనవాయితీగా ప్రతి ఏటా నిర్వహించే రథోత్సవంలో భాగంగా ఈ సంవత్సరం 7 -3-2026 తేదీన జరుగు శ్రీశ్రీ ఎర్రి తాత రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించిన అన్నట్లు ఆలయ పెద్దలు అర్చకులు తెలియజేశారు. ఈ రథోత్సవ సందర్భంగా శ్రీశ్రీ ఎర్రితాత ఆలయాన్ని శుక్రవారం రోజున విద్యుత్ కాంతులతో వైభవంగా ముస్తాబుఅయింది. అదే రోజు శుక్రవారం ఉదయం 7 గంటలకు శ్రీశ్రీ ఎర్రితాత స్వామి వారికి వేద బ్రాహ్మణులతో హోమాలు నిర్వహించిన అనంతరం మహాగణపతి పూజ, మహన్యాస రుద్రాభిషేకం , పాలాభిషేకం, పంచామృతా అభిషేకం అలంకరణ,ఆకుపూజ ,అర్చన మహానైవేద్యం , మం-మంగళహారతి తదితర విశేష పూజలు నిర్వహించారు. ఈ అభిషేకాలు, హోమము నందు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థ అన్న ప్రసాదాలు స్వీకరించినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. అదేవిధంగా 7-3-2026 శనివారం రోజున సాయంత్రం 4 గంటలకు శ్రీశ్రీ ఎర్రితాత మహా రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించినట్లు ఈ రథోత్సవ కార్యక్రమంలో భక్తులకు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని గ్రామ పెద్దలు ఆలయ అర్చకులు తెలియజేశారు

## ఉరుకుంద శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్‌గా ఎన్నికైన టీజీ పాండురంగయ్య శెట్టి కి ఘన సన్మానం



ఆదోని, మార్చి 6 (అనంత ప్రభ)
ఆదోని పట్టణంలో ఉరుకుంద శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్‌గా ఎన్నికైన టీజీ పాండురంగయ్య శెట్టి శుభ సందర్భాన్ని పురస్కరించుకుని పలు ఆర్యవైశ్య సంస్థల నాయకులు ఘనంగా సన్మానించారు.


ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ , ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ , ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ , వాసవి క్లబ్, వికాస తరంగిణి సంస్థల నాయకులు సంయుక్తంగా పాండురంగయ్య శెట్టిని అభినందించి పూలమాలలు వేసి, శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సన్మాన కార్యక్రమంలో అవోపా మరియు వామ్ అధ్యక్షులు, ఐవిఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి, వికాస తరంగిణి ఆదోని శాఖ ముఖ్య సమన్వయకర్త వంకదారు శ్రీనాథ్ గుప్తా పాల్గొన్నారు.

అలాగే అవోపా మరియు వామ్ మహిళా విభాగ్ అధ్యక్షురాలు వంకదారు మమతా శ్రీ, వాసవి క్లబ్ అధ్యక్షులు యాదగిరి వెంకటేశ్వర్లు మరియు మైత్రేయా మణి, ఐవిఎఫ్ ప్రధాన కార్యదర్శి నగరకంటి వెంకటేష్ బాబు, అవోపా కార్యదర్శి ఎన్. రఘు, ఐవిఎఫ్ ఉపాధ్యక్షులు మంచికంటి వెంకటేశ్వర్లు (నవత), ఐవిఎఫ్ జాయింట్ సెక్రటరీ పి. రఘు తదితర నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు టీజీ పాండురంగయ్య శెట్టికి అభినందనలు తెలుపుతూ, దేవస్థానం అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు.

## ఆలూరు గ్రామంలో "99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" ఘన ప్రారంభం -- గ్రామాభివృద్ధికి



ఆదోని, మార్చి 6 (అనంత ప్రభ)
ఆదోని మండలం ఆలూరు గ్రామ పంచాయతీలో "99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. గ్రామాభివృద్ధి లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో గ్రామంలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామ సర్పంచ్ 'నరసింహులు పిలుపునిచ్చారు.

గ్రామ అభివృద్ధి కోసం పరిశుభ్రత, వైద్యం, ఆరోగ్యం మరియు విద్యా రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. గ్రామ ప్రజల సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని తెలిపారు. ప్రతి శాఖ తమ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కూడా సూచించారు.

ఈ సందర్భంగా గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచడం, ఆరోగ్య సేవలను బలోపేతం చేయడం, విద్యా ప్రమాణాలను పెంపొందించడం వంటి అంశాలపై చర్చ జరిగింది. గ్రామాభివృద్ధి కోసం ప్రజలు మరియు అధికారులు కలిసి పనిచేయాలని సర్పంచ్ చేసి నరసింహులు కోరారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఉప సర్పంచ్, మహిళా సంఘాల సభ్యులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ సాధికారులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం కావాలని అందరూ ఆకాంక్షించారు.

## చంద్రబాబు నాయుడుని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ



అసెంబ్లీలోని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్యలయంలో వారిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ.
ఈ సందర్భంగా వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్జీలను అందజేశారు. అలాగే శింగనమల నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి పనుల గురించి వివరించగా.. చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## ఒకటో వార్డు సచివాలయం ముందుగానే మూసివేత -- సేవల కోసం ప్రజలు గంటల తరబడి వేచి




ఆదోని, మార్చి 6 (అనంత ప్రభ)
ఆదోని పట్టణంలోని ఒకటో వార్డు సచివాలయం పనితీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు సేవలు అందించాల్సిన సచివాలయాన్ని అధికారులు నిర్దిష్ట సమయం కంటే ముందుగానే మూసివేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.

గురువారం సాయంత్రం సుమారు మూడు గంటల 30 నిమిషాల ప్రాంతంలోనే సచివాలయాన్ని మూసివేయడంతో, సేవల కోసం వచ్చిన పలువురు ప్రజలు సచివాలయం ముందు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎంతసేపటికి తెరుస్తారో తెలియక ప్రజలు అక్కడే వేచి ఉండడం వల్ల తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

ఇలాంటి ఘటనలు ఇప్పటికే పలుమార్లు జరిగాయని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ సరైన చర్యలు తీసుకోవడం లేదని వారు అంటున్నారు. గతంలో మున్సిపల్ కమిషనర్ కూడా సచివాలయ సిబ్బందిని పిలిచి హెచ్చరించినప్పటికీ వారి పనితీరులో మార్పు కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలకు సేవలు అందించాల్సిన సచివాలయం ముందుగానే మూసివేయడం సరైనది కాదని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు డిమాండ్ చేశారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు

## కొత్తచెరువులో కిరాణా దుకాణంపై ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్




కొత్తచెరువు, మార్చి 6 (అనంత ప్రభ)
శ్రీ సత్యసాయి జిల్లా కొత్తచెరువు పట్టణంలోని శ్రీ సత్యసాయి జూనియర్ ప్రభుత్వ కళాశాల ఎదురుగా ఉన్న ఒక కిరాణా దుకాణాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గంజాయి,గుట్కా, ఖైనీ వంటి నిషేధిత ఉత్పత్తులను విక్రయించడం చట్ట విరుద్ధమని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ పదార్థాల విక్రయాన్ని నిషేధించిందని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి, గుట్కా, ఖైనీ నిషేధిత ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ముఖ్యంగా విద్యాసంస్థల పరిసర ప్రాంతాల్లో ఇలాంటి పదార్థాల విక్రయాన్ని పూర్తిగా అరికట్టాలని అధికారులకు సూచించారు

## ఎన్ ఎం ఎం ఎస్‌కు ఎంపికైన ఆరుగురు మోడల్ స్కూల్ విద్యార్థులు

యాడికి, మార్చి 6 (అనంత ప్రభ)
యాడికి మండలం రాయలచెరువు గ్రామ సమీపంలో ఉన్న మోడల్ స్కూల్ విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షలో ప్రతిభ కనబరిచారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఆరుగురు విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఉష తెలిపారు. ఎంపికైన విద్యార్థులు వి యశ్వంత్, ఎం యమునా, ఎన్ భరత్, ఎస్ గౌసియా, ఎం వర్షశ్రీ, యు విజయేంద్ర అని ఆమె పేర్కొన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహంగా ప్రభుత్వం ఈ స్కాలర్‌షిప్‌ను అందజేస్తుందని తెలిపారు. ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులను ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఉషతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది అభినందించి, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు

AP 4PG 7 - 3- 2026 SATURDAY qxp_Layout 1 07-03-2026 05:48 AM Page 3



## ఆదోని జిల్లా సాధన లక్ష్యంగా ఆదోని జిల్లా సాధనకు మధిర గ్రామంలో జేఏసీ అవగాహన సభ

ఆదోని, మార్చి 6 (అనంత ప్రభ)

గురువారం సాయంత్రం 7 గంటలకు ఆదోని మండలం మధిర గ్రామంలో గ్రామస్థులు ఆదోని జిల్లా జేఏసీ నాయకులకు తప్పెట్లు, డోళ్ళతో ఘన స్వాగతం పలికారు. "ఆదోని జిల్లా కోసం మేము సైతం" అంటూ మధిర గ్రామస్థులు దాదాపు 400 మందితో సమావేశాన్ని నిర్వహించారు.

గ్రామ పెద్దలు భాస్కర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ నారాయణ, మాజీ సర్పంచ్ గోవింద్, తిక్కన్న, నాగరాజు, చంద్రశేఖర్ రెడ్డి సహకారంతో గ్రామ–సభను నిర్వహించారు. ఈ కార్యక్రమం జేఏసీ నాయకులు కురువ అయ్యాలప్ప, నరేంద్ర యాదవ్ ఆధ్వర్యంలో జరిగింది. సమావేశానికి సుమారు 400 మంది గ్రామస్థులు హాజరయ్యారు.

ఈ సమావేశంలో ఆదినారాయణ రెడ్డి, రఘురామయ్య, అశోక్ ఆనంద్ రెడ్డి, కృష్ణమూర్తి గౌడ్, దస్తగిరి నాయుడు, కమతం వెంకటేష్, జీఎం లలిత, గంగపుత్ర ప్రకాష్, గోపాలచారి, జగదీష్ టీచర్, హనుమంతరావు, రామకృష్ణ తదితర జేఏసీ నాయకులు పాల్గొన్నారు.



సభను ఉద్దేశించి జేఏసీ నాయకుడు రఘురామయ్య మాట్లాడుతూ ఆదోని జిల్లాకి ఉన్న అవసరాన్ని, దాని వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. భౌగోళికంగా, జనాభా పరంగా, రవాణా సౌకర్యాల పరంగా, రెవెన్యూ పరంగా ఆదోని జిల్లా ఏర్పాటుకు అన్ని అర్హతలు ఉన్నాయని తెలిపారు. ఐదు నియోజకవర్గాలకు కేంద్రబిందువుగా ఆదోని ఉండటంతో పాటు, అన్ని నియోజకవర్గాలు కేవలం 35 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని పేర్కొన్నారు.

విద్య, వైద్య, వ్యవసాయ రంగాల అభివృద్ధి కోసం ఆదోని జిల్లాగా ప్రకటించడం అత్యవసరమని తెలిపారు. మన పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే ఆదోని జిల్లా సాధించే వరకు ఉద్యమం కొనసాగుతుందని చెప్పారు. ప్రతి వారం ఆదోని పట్టణంలోని వార్డుల్లో లేదా మండలంలోని గ్రామాల్లో ఆదోని జిల్లా అవసరంపై అవగాహన సమావేశాలు నిర్వహిస్తామని వెల్లడించారు. అదేవిధంగా మిగిలిన నాలుగు నియోజకవర్గాల మండల కేంద్రాల్లో కూడా సమావేశాలు ఏర్పాటు చేసి ఆదోని జిల్లా ఉద్యమాన్ని బలోపేతం చేసామని తెలిపారు.

ఈ సమావేశంలో ఆదినారాయణ రెడ్డి, కృష్ణమూర్తి, అశోక్ ఆనంద్ రెడ్డి, జీఎం లలిత, కమతం వెంకటేష్, దస్తగిరి నాయుడు, గోపాలచారి, గంగపుత్ర ప్రకాష్ తమ అభిప్రాయాలను వెల్లడించారు.

ఆదోని మండలంలోని మధిర గ్రామంలో నిర్వహించిన ఈ తొలి సమావేశానికి గ్రామస్థుల సహకారం మరువలేనిదని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ నారాయణ మాట్లాడుతూ ఆదోని జిల్లా సాధన కోసం జరిగే ఉద్యమాల్లో తప్పనిసరిగా పాల్గొంటామని తెలిపారు

## ఆదోనిలో... భూకబ్జాల పర్వం పెద్ద తుమ్మలం ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు... అధికారులకు తెలిసినా

ఆదోని, మార్చి 6 (అనంత ప్రభ)

ఆదోని మండలం పెద్ద తుమ్మలం గ్రామంలో ప్రభుత్వ భూములపై అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయనే ఆరోపణలు గ్రామంలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. గ్రామ పరిధిలోని సర్వే నంబర్ బి 360లో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

గ్రామస్తుల సమాచారం ప్రకారం, ఆ భూమిలో ఇప్పటికే అక్రమంగా షెడ్లు, గోడలు నిర్మించడం జరుగుతుండగా మరికొన్ని నిర్మాణాలు కూడా వేగంగా కొనసాగుతున్నాయని చెబుతున్నారు. ఈ భూమి ప్రభుత్వానికి చెందినదిగా ఉండి, గ్రామంలోని పేదలు మరియు భూమిలేని కుటుంబాలకు భవిష్యత్తులో కేటాయించాల్సిన భూమి అని గ్రామ పెద్దలు పేర్కొంటున్నారు. అయితే కొందరు వ్యక్తులు అధికారాన్ని మరియు ప్రభావాన్ని ఉపయోగించుకొని ఆ భూమిని తమ ఆధీనంలోకి తీసుకునే ప్రయత్నం చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

ఇలాంటి అక్రమ నిర్మాణాలు జరుగుతున్న విషయం స్థానిక రెవెన్యూ అధికారులకు తెలిసినా ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదని గ్రామ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొందరు గ్రామస్థులు పలుమార్లు అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినప్పటికీ స్పందన లేకపోవడంతో ప్రజల్లో



ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ప్రభుత్వ భూములను రక్షించాల్సిన బాధ్యత ఉన్న అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. వెంటనే అధికారులు స్పందించి అక్రమ కబ్జాలను అరికట్టి, ప్రభుత్వ భూములను రక్షించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అదే విధంగా ఈ భూమిపై జరుగుతున్న నిర్మాణాలపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇలా ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతుంటే పేదలకు న్యాయం ఎలా జరుగుతుందని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుంటారా? లేక ఈ భూకబ్జాలు ఇలాగే కొనసాగుతాయా? అనే ప్రశ్నలు గ్రామంలో వినిపిస్తున్నాయి.

## నిరుద్యోగుల ఉపాధి కోసం నూతన పరిశ్రమలు -- ఆదోని జిల్లాను ప్రకటించాలని డిమాండ్

ఆదోని, మార్చి 6 (అనంత ప్రభ)

తిమ్మారెడ్డి బస్టాండ్‌లో బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహానికి కరపత్రం అందజేత

ఆదోని జిల్లా సాధన కోసం జాయింట్ యాక్షన్ కమిటీ ) ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష 111వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆదోని పట్టణంలోని తిమ్మారెడ్డి బస్టాండ్ వద్ద ఉన్న బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహానికి కరపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, స్వాతంత్ర్యం అనంతరం కార్మిక శాఖ మంత్రిగా సేవలందించిన బాబు జగజ్జీవన్ రామ్ ఆశయాలను గుర్తుచేసుకుంటూ, ఆదోని ప్రాంత అభివృద్ధి కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో అనేక పరిశ్రమలు మూతపడటంతో వేలాది మంది నిరుద్యోగులుగా మారారని తెలిపారు.

పరిశ్రమలు మూతపడటంతో కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ, పిల్లల విద్య కూడా మధ్యలోనే ఆగిపోతున్న పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు పశ్చిమ



ప్రాంతంలోని ఈ ఐదు నియోజకవర్గాల్లో కొత్త పరిశ్రమలు స్థాపించేందుకు ఇప్పటివరకు ఎలాంటి ప్రయత్నాలు జరగలేదని విమర్శించారు.

ప్రజా వైద్యశాలల్లో కూడా నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో లేవని, కనీసం పాముకాటు, తేలుకాటు మందులు కూడా అందించలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. అందుకే ఆదోని రెవెన్యూ డివిజన్‌ను ఆదోని జిల్లాగా ప్రకటించి, కేంద్రం మరియు రాష్ట్రం నుంచి వచ్చే నిధులతో ప్రాంత అభివృద్ధి సాధించేందుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆదోని జిల్లా ప్రకటిస్తే స్థానిక వనరులను ఉపయోగించి పరిశ్రమలు నెలకొల్పి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించగలమని తెలిపారు. ఈ ఉద్యమానికి ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు అందరూ మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఆదోని జిల్లా సాధించే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

అలాగే ఈ ప్రాంతానికి చెందిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జడ్పిటిసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని, లేకపోతే ప్రజల ద్రోహులుగా నిలిచిపోతారని హెచ్చరించారు. రాజకీయ నాయకులు తమ పార్టీ ఉన్నత నాయకత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి ఆదోని జిల్లాను ప్రకటించేందుకు కృషి చేయాలని కోరారు.

111వ రోజు రిలే నిరాహార దీక్షలో రామాంజనేయులు, సుభాష్ చంద్రబోస్, బూదెప్ప, జగన్ దీక్షలో కూర్చొని మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదోని జిల్లా సాధన జేఏసీ నాయకులు పగడాల కోదండ, గోవిందు, పి.ఎస్. వీరేష్, గుమ్మల బాలస్వామి, అడ్వకేట్ రామాంజనేయులు, వై.పి. నాగరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## విగ్రహాలను ధ్వంశం చేసిన కేసులో ముద్దాయి అరెస్టు...

కదిరి , మార్చి 6 (అనంత ప్రభ)

కుమ్మరోల్ల పల్లి గ్రామము పురాతన శ్రీరాములు గుడి వద్ద సిమెంట్ తో తయారు చేయబడిన హనుమంతుడు, మరియు గరుత్మంతుడు స్వామి వారి విగ్రహాలను ధ్వంశం చేసిన వ్యక్తి అయిన కుంచపు వెంకటేష్, వయస్సు: 34 సంవత్సరాలు, తండ్రి: అంజినేయులు, మూర్తి పల్లి గ్రామము కదిరి అను వ్యక్తిని అరెస్టు చేయడం జరిగింది.

విచారణ చేయగా సదరు కుంచపు వెంకటేష్ గతములో సదరు గుడి గోపురము, మరియు రామాలయము ఆర్చ్ లను కట్టుటకు గుడి ధర్మకర్తలు నుండి ఒప్పందం చేసుకున్నాను అని, అయితే గుడి వద్ద కొంత పని అయిపోయిన తరువాత కూడా గుడి యాజమాన్యం తనకు చేసిన పనికి డబ్బులు ఇవ్వకుండా, వేరే వారికి సదరు పనిని అప్పగించినవారు అని తెలిసి, తాను ఉద్దేశపూర్వకంగా కోపముతో 04-03-2026 రాత్రి 10:30 గంటల సమయములో గుడి వద్దకు వెళ్ళి తన పని వేరే వారికి అప్పగించారనే కోపముతో అక్కడ ఉన్న సిమెంట్ తో తయారు చేయబడిన హనుమంతుడు, మరియు గరుత్మంతుడు స్వామి వారి విగ్రహాలను పాడి



చేయడం జరిగింది అని ఇచ్చిన స్టేట్మెంట్ కు మేరకు అతని అరెస్ట్ చేసి కోర్ట్ కు హాజరు పరచడం జరుగుతుంది.

ఇది కేవలము తాను గతములో గుడి పని చేసినందు డబ్బులు ఇవ్వలేదు అని, తానను కాదు అని వేరే వారికి పని అప్పగించారు అనే కోపముతో విగ్రహాలు పాడు చేయడం, ఆవేశముతో చేసిన చర్య తప్పా ఇందులో వేరే ఉద్దేశాలు ఏవీ లేవు. అయిననూ పూర్తి స్థాయిలో విచారణ చేసి తగు చర్య తీసుకోవడం జరుగుతుంది







## అరుదైన మౌలిక నీలం పసుపు



### కొబ్బరినూనె,కరివేపాకుతో నూనె..

కొబ్బరినూనె గురించి తెలియని వారు ఉండారు. దీనిలోని పోషకాలు ఆయుర్వేదం ప్రకారం జుట్టుని సంరక్షిస్తుంది. ఇందులో లారిక్ యాసిడ్ ఉంటుంది. ఇది జుట్టు షాఫ్ట్‌లోకి చొచ్చుకుపోయి ప్రోటీన్‌లా పని చేస్తుంది. ఇక కరివేపాకులో యాంటీ ఆక్సిడెంట్స్, అమైనో యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి జుట్టుని పెరిగేలా చేస్తాయి. ఈ రెమిడీని ఉపయోగించడానికి పాన్‌లో కొబ్బరినూనెని వేడి చేసి కొన్ని తాజా కరివేపాకులు వేయండి. దీన్ని వేడి చేసి చల్లారనివ్వండి. దీనిని జుట్టుకి మసాజ్ చేయండి. ఓ రాత్రంతా అలానే ఉంచొచ్చు. లేదా 30 నిమిషాల పాటు ఆగిన తర్వాత షాంపూ చేయండి.

### భృంగరాజ్..

భృంగరాజ్.. ఈ మధ్యకాలంలో ఎక్కువ పాపులర్ అవుతున్న మూలిక ఇది. ఇప్పుడంటే సిటీల్లో ఉన్నవారికి తెలుస్తుంది. కానీ, అంతకుముందు గ్రామాల్లోని వారికి ఇది తెలుసు. ఈ చెట్టులో ఎక్కువగా ఐరన్, విటమిన్ ఇ, మెగ్నీషియం వంటి పోషకాలు ఉన్నాయి. ఇవి జుట్టు కుదుళ్ళని బలంగా చేస్తాయి. నూనెలో ఈ ఆకులు వేసి మరిగించి అది గోరువెచ్చగా అయ్యాక తలకి రాసుకోవాలి. ఇది స్కాల్ప్‌ని బలంగా చేస్తాయి. నిద్రపోయే ముందు తలకి రాయడం వల్ల జుట్టు రాలే సమస్యలు తగ్గుతాయి.

### ఉల్లిపాయ రసం..

ఉల్లిపాయ రసం కూడా జుట్టు పెరిగేలా చేస్తుంది. దీనిలో సల్ఫర్ ఎక్కువగా ఉంటుంది. ఇది కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచి జుట్టుని బలంగా చేస్తుంది. ఉల్లిరసాన్ని కొబ్బరి నూనెలో కలిపి అందులోనే మందార, కరివేపాకు ఇతర మూలికలు వేసి ఆయిల్‌ని మరిగించి గోరువెచ్చగా అయ్యాగా తలకి రాయాలి. దీని స్కాల్ఫ్, హెయిర్‌కి మసాజ్ చేయాలి. కనీసం 30 నిమిషాలు అలాగే ఉంచండి.

### ఉసిరి పొడి..

ఉసిరి పొడిలో యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉంటాయి. దీనిని రాయడం వల్ల జుట్టు పెరుగుతుంది. ఇందులో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. కొల్లాజెన్‌ని ఉత్పత్తి చేసి జుట్టు పెరిగేలా చేస్తుంది. అందుకోసం ఉసిరి ప్యాక్ వేసుకోవచ్చు. ఉసిరిపొడిని నీటితో కలిపి జుట్టుకి ప్యాక్ వేసుకోవాలి. దీని వల్ల జుట్టు రాలడం తగ్గి బాగా పెరుగుతుంది.

## కడుపులో మంటగా ఉందా? ఈ ఆయుర్వేద చిట్కాలతో వెంటనే ఉపశమనం

ఛాతిలో లేదా కడుపులో మంట, కడుపు ఉబ్బరంగా అనిపించడాన్ని గ్యాస్ ప్రాబ్లం అని చెబుతుంటాం. మనలో ఎవరో ఒకరు ఈ సమస్యను ఏదో ఒక సందర్భంలో ఎదుర్కొనే ఉంటాం. కడుపులో గ్యాస్ చేరినపుడు ఛుక్తాయాసంగా ఉంటుంది. గ్యాస్ పైకి లేదా పక్కలకు విస్తరించినపుడు రకరకాలుగా నొప్పి కూడా వస్తుంది. దీని కోసం మామూలుగా యాంటీసీడ్స్(%ూ఑ఖఎఅం%) వాడుతుంటారు. ఇవి ఎక్కువ కాలం పాటు వాడితే కిడ్నీల మీద దుష్ప్రభావం పడుతుంది. అలా అని మందులు వేసుకోకపోతే రోజువారీ జీవితంలో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కనుక ఇతర దుష్ప్రభావాలు లేకుండా చిన్న చిన్న చిట్కాలతో కూడా ఈ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు.

ఆయుర్వేద వైద్యులు డాక్టర్ డిక్సా భావ్ సర్ సవలియా ఇన్ స్టాగ్రామ్ ద్వారా అసిడికి కొన్ని చికిత్సల గురించి తెలిపారు. వయసు పెరిగే కొద్దీ పిత్త గుణం ఆధిపత్యం చూపుతుంది. వాత, కఫ దోషాలు బాల్యంలో, ఇంకా వృద్ధాప్యంలో ఎక్కువ ఆధిపత్యంలో ఉంటాయని ఆమె అభిప్రాయపడ్డారు.

మనం తీసుకునే ఆహారం విషయంలో నిర్లక్ష్యం వల్ల ఇలాంటి సమస్యలు వస్తాయని సావలియా పేర్కొన్నారు. ఈరోజుల్లో చాలా మంది కంటికి నచ్చింది లేదా రుచి బావుందని తినేస్తున్నారు. ఫలితంగా జీర్ణసంబంధ ఇబ్బందులు వస్తున్నాయి. అంతేకాదు, పెరిగిన ఒత్తిడి కూడా అసిడిటి సమస్య పెరగడానికి మరో కారణం. తగినంత శారీరక శ్రమ లేకపోవడం, వ్యాయామం గురించి పట్టించుకోకపోవడం వంటివి కూడా కారణాలే అని అభిప్రాయపడ్డారు. 12 వారాల పాటు తీసుకోవాల్సిన ఆయుర్వేద చికిత్సల గురించి మూడు రకాల చిట్కాలను వివరించారు "శరీరంలో మాత్రమే కాదు మనసులో కూడా చేరిన పిత్తం తగ్గించి మీ అసిడిటీ సమస్య నుంచి ఉపశమనాన్ని ఇస్తుంది" అని చెప్పారు.

### ధనియాల కషాయం

ఒక గ్లాసు అంటే దాదాపు 300 మి.లీ. నీళ్లు తీసుకొని దానిలో ఒక టేబుల్ స్పూన్ ధనియాలు, 5 పుదీనా ఆకులు, 15 కరివేపాకులు వేసి 5 నిమిషాల పాటు మరిగించాలి. తర్వాత ఈ కషాయాన్ని వడకట్టి పరగడుపున తీసుకోవాలి.

### సోంప్



ప్రతి భోజనం తర్వాత ఒక టీ స్పూన్ సోంఫ్ నమలడం ద్వారా కూడా కడుపు ఉబ్బరం నుంచి ఉపశమనం దొరుకుతుంది.

### రోజ్ టీ


ఒక కప్పు అంటే దాదాపు 150 మి.లీ. నీళ్లు తీసుకుని 3 నిమిషాల పాటు మరిగించాలి. దానికి కొన్ని ఎండు గులాబి రేకులను చేర్చి మూత పెట్టి ఉంచాలి. 5 నిమిషాల తర్వాత వడగట్టి తీసుకుంటే మంచిది. దీన్ని రాత్రి నిద్రకు అరగంట ముందు తాగితే మంచి గుణం కనిపిస్తుంది.

ఇలా.. 12 వారాల పాటు పైన సూచించిన చిట్కాలు పాటించి చూడండి. తప్పకుండా మీ సమస్య దూరం అవుతుందని ఆమె హామీ ఇస్తున్నారు. కొందరు క్రానిక్ అసిడిటీతో కూడా బాధ పడుతుంటారు. వీటికి ఆయుర్వేదంలో మంచి పరిష్కారాలు ఉన్నాయని ఆమె తన పోస్ట్ లో వివరించారు.

AP 4PG 7 - 3- 2026 SATURDAY qxp_Layout 1 07-03-2026 05:48 AM Page 4



# 250 ఏళ్ల కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా శ్రీలీల.. రెమ్యునరేషన్ ఎన్ని కోట్లంటే?

కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన మైసూర్ శాండల్ సోప్‌కు స్టార్ హీరోయిన్ తమన్నా భాటియాను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడంపై కన్నడ సీమ రగిలిపోతోన్న సంగతి తెలిసిందే. దాదాపు 6.2 కోట్ల పారితోషికంతో తమన్నాకు ఈ బాధ్యతను కట్టబెట్టింది సిద్ధరామయ్య ప్రభుత్వం. అయితే కర్ణాటకలో ఎంతో మంది ప్రముఖులు, ప్రతిభావంతులు ఉండగా పరాయి రాష్ట్రానికి చెందిన నటిని మైసూర్ శాండల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం వివాదానికి దారి తీసింది. కర్ణాటక సంఘాలు, పార్టీలు, ప్రముఖులు ప్రభుత్వ తీరును తప్పుబడుతున్నారు. ఈ క్రమంలో కర్ణాటకకి చెందిన యువ కథానాయిక శ్రీలీల అదిరిపోయే ఆఫర్ అందుకున్నారు. ఈ వివరాల్లోకి వెళితే..

చేతినిండా సినిమాలతో శ్రీలీల బిజీ ప్రస్తుతం టాలీవుడ్‌లో బిజీగా ఉన్న హీరోయిన్ ఎవరంటే ఖచ్చితంగా వినిపించే పేరు శ్రీలీల. ధమాకాతో లైమ్ లైట్‌లోకి వచ్చిన ఈ ముద్దగుమ్మ ఆ తర్వాత భగవంత్ కేసరి, గుంటూరు కారం వంటి భారీ బడ్జెట్ సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంది. ఇక పుష్ప 2లో కిస్సిక్ సాంగ్‌తో దేశాన్ని ఊపేసి నేషనల్ వైడ్ పాపులర్ అయ్యింది. అందం, అభినయం, డ్యాన్స్‌తో క్రేజీ ఆఫర్లు పట్టేస్తోంది. చాలా చిన్న వయసులోనే బాలీవుడ్ ఆఫర్ కూడా అందుకోవడంతో శ్రీలీల అదృష్టంపై సీనియర్ హీరోయిన్లు, అప్ కమింగ్ హీరోయిన్లు అసూయ పడుతున్నారు. ఏళ్లుగా నిరీక్షిస్తున్న తమ వల్ల కానిది శ్రీలీల ఈజీగా సాధిస్తోందని కుళ్లుకుంటున్నారు.

ఆషికి 3తో బాలీవుడ్‌లోకి బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన ఆషికి 3 అనే సినిమా ద్వారా బాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు శ్రీలీల. అనురాగ్ బసు ఈ చిత్రానికి దర్శకుడు. దీపావళి కానుకగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు. దీనిలో భాగంగా శరవేగంగా సినిమాను పరుగులు పెట్టిస్తున్నాడు అనురాగ్. అయితే అషికి 3 ఇంకా సెట్స్ మీద ఉండగానే శ్రీలీల హిందీలో మరో ఆఫర్ అందుకున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. మరో స్టార్ హీరో సిద్ధార్ధ్ మల్హోత్రా సరసన శ్రీలీల ఆడిపడనుందట. ఆనంద్ ఎల్ రాయ్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. రాజ్ సాండియాలా దర్శకత్వం వహిస్తారని బీటౌన్ టాక్. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇక తెలుగులో జూనియర్, మాస్ జాతర, లెనిన్, తమిళంలో పరాశక్తి సినిమాలలో శ్రీలీల నటిస్తున్నారు.

టాప్ బ్రాండ్స్‌కు అంబాసిడర్‌గా సినిమా హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా శ్రీలీల వరుస అవకాశాలు అందుకుంటున్నారు. ఇక బ్రాండ్ అండార్స్‌మెంట్స్‌తోనూ ఈ ముద్దుగుమ్మ భారీగా సంపాదిస్తోందట. న్యూడ్ స్కిన్ కేర్, అమృత గ్రూప్, ప్రెస్టా వుమెన్స్ వేర్, నీరూస్ తదితర బ్రాండ్స్‌కు శ్రీలీల అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా శ్రీలీల అండార్స్‌మెంట్స్ కెరీర్‌లోనే మైల్ స్టోన్ అనదగ్గ ఆఫర్ వచ్చింది.

శ్రీలీలతో యూకే కంపెనీ డీల్ పర్సనల్ కేర్, కాస్మోటిక్స్, ఫ్రాగ్‌రెన్సెస్ విభాగంలో ప్రపంచంలోని అగ్రగామి సంస్థల్లో ఒకటైన యార్డ్లే లండన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ కంపెనీకి దాదాపు 255 ఏళ్ల చరిత్ర ఉండగా.. ప్రపంచంలోని అత్యంత పురాతన కంపెనీల్లో ఒకటిగా యార్డ్లేకు పేరుంది. 2009లో యార్డ్లేను భారత కార్పోరేట్ దిగ్గజం విప్రో ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలు చేసింది. ఇంతటి చరిత్ర కలిగిన ఈ సంస్థలోని ఫ్రాగ్‌రెన్సెస్ విభాగానికి గాను భారత్‌లో శ్రీలీల ప్రమోట్ చేయనుండటం విశేషం.

పారితోషికం ఎంతంటే? అయితే ఇందుకు గాను శ్రీలీల ఎంత మొత్తంలో పారితోషికం అందుకుంటున్నారన్నది తెలియరాలేదు. ప్రస్తుతం బ్రాండ్ ప్రమోషనింగ్ కోసం రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల మధ్య శ్రీలీల ఛార్జ్ చేస్తుండటంతో ఇది కూడా అదే స్థాయిలో లేదా ఆపైనా ఉండే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. యార్డ్లే నుంచి శ్రీలీల పారితోషికంగా ఎంత మొత్తం వసూలు చేస్తున్నారనే దానిపై త్వరలోనే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.



# చిరంజీవికి అలా.. బాలయ్యకు ఇలానా? అల్లు అరవింద్‌నే అడగండి..



మెగా ఫ్యామిలీ, అల్లు కుటుంబానికి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకొన్నాయనే విషయాల గురించి మీడియాలో ఎక్కువగా చర్చ జరుగుతున్నది. ఈ రెండు కుటుంబాలు నర్మగర్భంగా మాట్లాడే తీరు ఆ వివాదాస్పద అంశానికి బలం చేకూరేలా కనిపిస్తుంటుంది. అయితే సాధారణ ప్రజలకు ఆ కుటుంబాల మధ్య గతంలో ఉన్న సఖ్యత, బంధాలు లేవనే అపోహ మాత్రం ఏర్పడింది. అయితే ఈ విషయాలపై రెండు కుటుంబాలకు ఆప్తుడైన తండేల్ నిర్మాత బన్నీ వాసు వెల్లడించిన వివరాల్లోకి వెళితే..


ఇటీవల కాలంలో అల్లు ఫ్యామిలీకి నందమూరి బాలకృష్ణ అత్యంత చేర–ువైనట్టు బయట వాళ్లకే కాకుండా సినిమా వర్గాలకు అనిపిస్తుంది. అయితే ఈ క్రమంలో బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు రావడంపై అన్ని వర్గాల నుంచి స్పందన వ్యక్తమైంది. అయితే సినీ పరిశ్రమ ఈ సందర్భాన్ని పు–రస్కరించుకొని భారీ సమావేశాన్ని ఏర్పాటు చేసి.. ఆయనకు సన్మానం చేయాలనే ఆలోచనలో సినిమా పరిశ్రమ ఉందనే వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతున్నది.

అయితే బన్నీ వాసును ఈ విషయంపై మెగాస్టార్ చిరంజీవికి పద్మభూషణ్ వస్తే ఎలాంటి సన్మానం చేయలేదు. మెగా హీరోలు, మెగా కుటుంబం పెద్దది అనే ఫీలింగ్ ఇండస్ట్రీలో ఉంది. ఆ సన్మాన కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహించలేదని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సరైన రీతిలో స్పందించారు.

పద్మ భూషణ్ అవార్డు అందుకొన్నందుకు చిరంజీవికి సన్మానం చేయకపోవడం.. బాలకృష్ణకు చేయాలనే ప్లాన్ చేయడం లాంటి విషయాలను అరవింద్ గారి లాంటి పెద్ద వాళ్లను అడిగితే బాగుంటుంది. అది చాలా పెద్ద విషయం. నా వయసుకు, నా స్థాయికి మాట్లాడే విషయం కాదు. అరవింద్ గారినే అడిగితే మంచింది. ఈ పరిస్థితుల్లో నేను ఏం మాట్లాడినా బాగుండదు. ఆ విషయం గురించి నేను మాట్లాడితే కరెక్ట్ కాదు అంటూ బన్నీ వాసు తప్పించుకొన్నారు.

నంద్యాల వివాదం తర్వాత నాకు, పవన్ కల్యాణ్‌కు మధ్య గ్యాప్ వచ్చిందనే విషయం సరికాదు. అందులో వాస్తవం లేదు. పవన్ కల్యాణ్ మెచ్యూరిటీ లెవెల్స్ వేరేగా ఉంటాయి. ఆయన ఇలాంటి విషయాలను మనసులో పెట్టుకోని చూడరు. ఎవరు ఏం చేస్తున్నారు? ఎవరు ఎలాంటి వారు? అనేది ఆయనకు ఫుల్లుగా క్లారిటీ ఉంది. నా విషయంలో ఆయన బన్నీతో కలిపి చూడరు.పార్టీకి ఏం చేస్తున్నాను? పార్టీ కోసం ఎలా ఉ ంటున్నారనేది ఆయన చూస్తారు అని బన్నీ వాసు వివరణ ఇచ్చారు.

# మహేష్ బాబు వదిలేసిన 1800 కోట్ల సినిమా.. థియేటర్లు బద్దలయ్యేవి.. ఆ మూవీ ఏంటంటే?

సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం ఇండియాస్ బిగ్గెస్ట్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్ లోనే మూడవ షెడ్యూల్ జరుగుతోంది. చిత్రీకరణ విషయంలో మాత్రం జక్కన్న ఎస్. ఎస్. ఎం.బి 29 సినిమాను శరవేగంగా కొనసాగిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. మలయాళం సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస–్తున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే మహేష్ బాబు చివరిగా గుంటూరు కారం చిత్రంతో ప్రేక్షకులను అలరించిన సంగతి తెలిసిందే. అది సూపర్ స్టార్ మహేష్ బాబు ఇప్పటివరకు రెగ్యులర్ క్యారెక్టర్లలోనే నటిస్తూ వచ్చారు. కానీ అభిమానులు మాత్రం ఆయనను పవర్ఫుల్ రోల్స్ లో చూడాలని ఎంతగానో ఆశిస్తున్నారు. ఈ క్రమంలోనే మహేష్ బాబు వదిలే–సుకున్న 1870 కోట్ల సినిమా గురించి తాజాగా న్యూస్ బయటకు వచ్చింది. ఆ సినిమా చేసి ఉంటే మాత్రం మహేష్ బాబు ఇండియా ను షేక్ చేసే వారిని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

ఇంతకీ ఆ సినిమా ఏంటో తెలిస్తే అందరూ షాక్ అవ్వాల్సిందే. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కాంబినేషన్లో వచ్చిన పుష్ప చిత్రమే కావడం విశేషం. అయితే ఈ సినిమాకు మొదట హీరోగా మహేష్ బాబు అని అనుకున్నట్టుగా ఇప్పుడు తెలుస్తోంది. కానీ మహేష్ బాబు ఆ సినిమాలు వదులుకోవడంతో అల్లు అర్జున్ వద్దకు వెళ్లిందని ఫిల్మ్ సర్కిల్స్ లో గుసగుసలు నడుస్తున్నాయి. ఇక అల్లు అర్జున్ టెర్రిఫిక్ పెర్ఫార్మెన్స్ తో పుష్ప, పుష్ప 2 చిత్రాలు ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేశాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

రీసెంట్ గా వచ్చిన పుష్ప 2 చిత్రం ఏకంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది. 1870 కోట్లు గ్రాస్ కలెక్ట్ చేసి ఇండియాలోనే హైయెస్ట్ గ్రాస్ కలెక్ట్ చేసిన రెండవ సినిమాగా రికార్డు సెట్ చేసింది. బాహుబలి 2 సాధించిన బాక్సాఫీస్ కలెక్షన్లు 1810 కోట్లను దాటేసి మరి ఈ రికార్డును సెట్ చేయడం సెన్సేషన్ గా మారింది. మన వైపు అల్లు అర్జున్ కు పుష్ప పాత్రలో నటించినందుకు ఏకంగా బెస్ట్ యాక్టర్ విభాగంలో నేషనల్ అవార్డు వరించిన సంగతి తెలిసిందే. ఇక నెక్స్ట్ పుష్ప 3 కూడా రాబోతుంది. ఆ పార్ట్ లో విజయ్ దేవరకొండ నటిస్తారని తెలుస్తోంది.

అయితే ఇంతటి సెన్సేషన్ క్రియేట్ చేసిన పుష్ప చిత్రాన్ని మహేష్ బాబు ఎందుకు వదులుకున్నారా అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ క్వశ్చన్ గా మారింది. అయితే పుష్ప చిత్రం ప్రారంభానికి ముందు మహేష్ బాబు ఇంట్లో వరుసగా విషాదాలు నెలకొనడం, గుంటూరు కారం చిత్రం తర్వాత ఎస్ఎస్ రాజమౌళి తో సినిమాకు కమిట్ అవ్వడమే కారణం అని తెలుస్తుంది. ఇక పుష్ప చిత్రమే కాదు, శంభాజీ మహారాజ్ జీవిత కథతో వచ్చిన చావా చిత్రాన్ని కూడా మహేష్ బాబు వదిలేసారంట. ఈ హిస్టారికల్ ఫిలిం లో మహేష్ బాబు నటించిన మాత్రం మరింత బీభత్సం సృష్టించే వారిని ఫ్యాన్స్ అభిప్రాయపడ్డారు. ఇలా తన ముందుకు వచ్చిన రెండు బ్లాక్ బస్టర్ మూవీస్ ను మహేష్ బాబు వదులుకోవడం ఆసక్తికరంగా మారింది. ఎస్. ఎస్. ఎం.బి 29 తో మాత్రం ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను చెల్లాచెదురు చేస్తారని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ఆ ప్రాజెక్టుకు మార్కెట్లోనూ భారీ డిమాండ్ ఉండింది.

# భైరవం మూవీ రివ్యూ అండ్ రేటింగ్

వీపురంలో జమీందార్ వంశానికి చెందిన గజపతి (మనోజ్ మంచు)కి గ్రామంలో పేరు ప్రతిష్టలు ఉన్నప్పటికీ.. పేదరికం వెంటాడుతుంటుంది. గజపతికి తన ఊరిలోనే పెద్దరికాన్ని ప్రదర్శించే వరద (నారా రోహిత్), అనాథగా బతికే శ్రీను (బెల్లంకొండ శ్రీను) ప్రాణస్నేహితులుగా ఉ ంటారు. ఇదిలా ఉండగా, ఆ గ్రామంలోని ఆలయ ధర్మకర్తగా గజపతి నానమ్మ (జయసుధ) ఉంటారు. ఆలయ భూములు కాజేయడానికి మంత్రి (శరత్ లోహితస్య) పన్నాగం పన్నుతాడు.

అనాథ అయినప్పటికీ శ్రీనును కన్నబిడ్డగా ప్రజలు ఎందుకు చూస్తారు? శ్రీనుతో వెన్నెల (అదితి శంకర) లవ్ ట్రాక్ ఎలా సాగింది? గజపతిని భార్య నీలిమ (ఆనంది) ఎలా వేధించింది. భార్య ఒత్తిళ్లకు గజపతి తన మనసును ఎలా మార్చుకొన్నాడు. ప్రాణస్నేహితులుగా ఉండే గజపతి, వరద, శ్రీను మధ్య మంత్రి ఎలా చిచ్చు పెట్టారు. వరద స్నేహం కోసం ప్రాణాలిచ్చేంత ప్రేమ ఉన్న గజపతి తన స్నేహితులకు ఎందుకు ఎదురు తిరిగాడు? వరద, గజపతి, శ్రీను మధ్య విభేదాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీశాయి? అనే ప్రశ్నలకు సమాధానమే భైరవం సినిమా కథ.

పోలీస్ ఇన్స్‌పెక్టర్ (సంపత్ రాజ్) తన ఉద్యోగానికి రాజీనామాను పై అధికారికి సమర్పించడంతో సినిమా హై నోట్‌లో మొదలవుతుంది. తన రాజీనామాకు కారణం చెప్పడం మొదలు పెట్టడంతో దేవీ పురంలో ముగ్గురు ప్రాణ స్నేహితుల కథను ఎమోషనల్‌గా దర్శకుడు ప్రారంభించాడు. ముగ్గురు హీరోల ఇంట్రడక్షన్, ఎలివేషన్స్‌ను బాగానే డిజైన్ చేశాడు. ఆ తర్వాత శ్రీను ప్రేమ కథ, వరద, గజపతి ఫ్యామిలీ మధ్య ఉండే అన్యోన్యతను, కథను ఎస్టాబ్లిష్ చేయడానికి కాస్త టైమ్ ఎక్కువగా తీసుకొన్నట్టు అనిపిస్తుంది. ఫస్టాఫ్‌ను రెగ్యులర్, రొటీన్ ఫార్మాట్‌తో నడిపించినప్పటికీ.. ఇంటర్వెల్ ముందు పవర్‌ఫుల్ ఎపిసోడ్‌తో తొలిభాగాన్ని ముగించి సెకండాఫ్‌పై ఆసక్తిని పెంచాడు.

అయితే ముగ్గురు హీరోల మధ్య ఎమోషన్స్, బాండింగ్‌ను బలంగా ఎస్టాబ్లిష్ చేయాల్సి ఉన్నప్పటికీ.. ఆ దిశగా ప్రయత్నం సరిగా చేయలేదనే ఫీలింగ్ కలుగుతుంది. భావోద్వేగంతో చెప్పాల్సిన సన్నివేశాల్లో యాక్షన్ నింపడం వల్ల సినిమాలో సోల్ కాస్త మిస్ అయిందనిపిస్తుంది. ఇలాంటి లోపాలు ఉన్నప్పటికీ.. మామిడితోట సీన్ నుంచి మూవీలో సన్నివేశాలు నెక్స్ట్ రేంజ్‌లోకి వెళ్తాయి. క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించిన తీరు విజయ్ కనకమేడల ప్రతిభ ఎంతో తెలుస్తుంది. సెకండాఫ్‌ను ఇంకాస్త బెటర్‌గా డిజైన్ చేయాల్సిందనే ఫీలింగ్ కలుగుతుంది. నటీనటుల ఫెర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. బెల్లంకొండ శ్రీనివాస్ ఈ సినిమాకు బ్యాక్ బోన్‌గా నిలిచాడు. సినిమాలోని ఎమోషనల్ కంటెంట్‌ను తన పాత్ర ద్వారా బాగా ఎలివేట్ చేశాడు. నటుడిగా మరింత మెచ్యూరిటీని చూపించాడు. ప్రీ క్లైమాక్స్ నుంచి క్లైమాక్స్ సన్నివేశాల్లో తనలోని నట విశ్వరూపాన్ని చూపించే ప్రయత్నం చేశాడు. నారా రోహిత్, మనోజ్‌తో పాత్రలతో మమేకమై మంచి బాండింగ్‌ను ఆన్ స్క్రీన్‌పై ఎలివేట్ చేశాడు. ఇక మనోజ్ మంచు నటుడిగా మరో రేంజ్ పెర్ఫార్మెన్స్ చేశాడు. కాస్త విరామం తీసుకొన్నప్పటికీ.. సూపర్ క్యారెక్టర్‌తో రీ ఎంట్రీతో అదరగొట్టాడు. ఇండస్ట్రీలో తన టైమ్ స్టార్ట్ అయిందని గజపతి పాత్ర ద్వారా చాటి చెప్పాడు. నారా రోహిత్ విషయానికి వస్తే.. వరద పాత్రలో హుందాగా కనిపించాడు. తన పాత్రకు ఎంత ఎమోషన్ కావాలి? ఎంత యాక్షన్ కావాలో అంతే సమతుల్యాన్ని పాటించి సటిల్‌గా స్క్రీన్ పై కనిపించాడు. ఇక నాన్నమ్మగా జయసుధ పాత్ర అంతంత మా–త్రమేగానే ఉన్నప్పటికీ.. స్క్రీన్ మీద కనిపించినంత సేపు ఆమె ప్రజెన్స్ బాగుంది. ఈ సినిమా కథను నడిపించే పాత్రలో నీలిమగా ఆనంది నటన బాగుంది. కేవలం గ్లామర్ పరంగానే కాకుండా ఆనంది పాత్రల స్వరూపాన్ని, సినిమా కథ దిశను మార్చే పాత్రలో ఒదిగిపోయింది. ఇక నారా రోహిత్ భార్య పాత్రలో పూర్ణిమగా దివ్య పిళ్లై ఎమోషనల్ కంటెంట్‌ను సినిమాకు అందించే విధంగా పెర్ఫార్మ్ చేశారు. వెన్నెల కిషోర్ కామెడీ పెద్దగా వర్క్ కాలేదు. సంపత్ రాజ్, శరత్, అజయ్, ఇతర పాత్రలు సినిమాలో గుర్తుంచుకొనే పాత్రల్లో కనిపించారు.

టెక్నికల్ అంశాల విషయానికి వస్తే.. ఈ సినిమాకు శ్రీ చరణ్ పాకాల మ్యూజిక్ ప్రధానమైన బలంగా మారింది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తోనే కాకుండా హీరోల ఇంట్రడక్షన్ సాంగ్ సంక్రాతి పాట, అలాగే వెన్నెల, గిచ్చు గిచ్చు సాంగ్ ఆడియో పరంగా ఫుల్ జోష్‌ను కలిగిస్తే.. తెర మీద అదే జోష్‌ను చూపించారు. ఇక ఈ సినిమాలో మంచి మాస్ యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్నాయి. వాటితో గ్రామంలోని వాతవరణాన్ని హరి కె వేదాంతం చక్కగా, చాలా సహజంగా చిత్రీకరించాడు. కేకే రాధామోహన్ ఈ మూవీని రాజీ లేకుండా మంచి క్వాలిటీతో సినిమాను అందించారు. ప్రొడక్షన్ వాల్యూస్ హై స్టాండర్డ్‌లో ఉన్నాయి. కంటెంట్‌పై మరింత దృష్టిపెట్టి ఉంటే బెస్ట్ మాస్ యాక్షన్ మూవీ అయి ఉండేదనిపిస్తుంది. తమిళంలో సూపర్ హిట్ అయిన గరుడన్ సినిమాకు భైరవం రీమేక్. ఈ సినిమాలో అన్ని రకాలు ఎమోషన్స్ ఉ ంటాయి. కొన్ని చోట్ల భావోద్వేగాలు లోపించాయి. యాక్షన్ పార్ట్ సినిమా ఫ్లేవర్‌ను మార్చేసింది. పాటల బాగున్నప్పటికీ వాటి ప్లేస్ మెంట్ సరిగా లేకపోవడం వల్ల మంచి ఫ్లోలో వెలుతున్న స్టోరికి బ్రేకులు వేశాయా? అనిపిస్తుంది. ఈ సినిమా పక్కా మాస్ ఎంటర్‌టైనర్. బెల్లంకొండ శ్రీను, నారా రోహిత్, మనోజ్ మంచు ఫెర్ఫార్మెన్స్ ఈ సినిమాకు హైలెట్. కథ పరంగా పాత కథే.. కాకపోతే డిఫరెంట్‌గా చేయాలన్న ప్రయత్నం కొంత ట్రాక్ తప్పింది. టోటల్‌గా ఈ సినిమాను థియేటర్‌లో ఓసారి చూసేయొచ్చు అనేది నా అభి–ప్రాయం.



PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com